క్లుప్తంగా

ఘనంగా అయ్యప్ప మండల పూజ


ప్రత్యేక అలంకారంలో అయ్యప్పస్వామి

పులివెందుల టౌన్ : పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం మండల పూ జ ను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం 18 మెట్లకు పూజలు నిర్వహించి అయ్యప్ప స్వాములకు తీర్థప్రసాదాలు పంచి పెట్టారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా ఆరాధన మహోత్సవం


భక్తులను అలరించిన కోలాటం

వీరపునాయునిపల్లె : మండలంలోని పాలగిరి క్రాస్ రోడ్డు వద్ద వెలసిన కాశినాయన ఆలయంలో 29వ ఆరాధన హహోత్సవం ఆదివారం వైభంగా జరిగింది. ఉదయం కాశిరెడ్డి నాయన మూలమూర్తితో పాటు ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆరాధన మహోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. నిర్వాహకులు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. తాళాల భజన, కోలాటం భక్తులను ఆకట్టుకున్నాయి. అమ్మ ఒడి చారిటబుల్ ట్రస్ట్ అధ్వర్యంలో భక్తులకు అన్నదాన ఏర్పాటు చేశారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని మాలెపాడు గ్రామ సమీపంలోని కాశీనాయన గుడిలో 29వ కాశీనాయన ఆరాధనోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ గుడిని ప్రొద్దుటూరుకు చెందిన ఓ దాత ఆధునికరణ పనులు చేసి ఆరాధనోత్సవాలను నిర్వహించారు. కోలాటం నిర్వహించారు. వచ్చిన భక్తులకు భోజన సదుపాయం కల్పించారు.

చలో కడపకు తరలివెళ్లిన ముస్లింలు

కమలాపురం : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ముస్లిం సోదరులు చలో కడపకు తరలివెళ్లారు. ఆదివారం కడప నగరంలోని జయరాజ్ గార్డెన్స్‌లో జమియత్ ఉలమా ఏ హింద్ ఆధ్వర్యంలో జరుగుతున్న బహిరంగ సభకు కమలాపురం పట్టణంతో పాటు గంగవరం, విభరాపురం, కోగటం, చిన్నచెప్పలి, పెద్దచెప్పలి, పందిళ్లపల్లె, గోపులాపురం, జీవంపేట తదితర గ్రామాలకు చెందిన ముస్లిం సోదరులు ప్రత్యేక వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. ఢిల్లీకి చెందిన హజ్రత్ మౌలానా ఆయిసె సయ్యిద్ అర్షద్ మదని హాజరు కానుండటంతో మండల ముస్లిం ప్రజలు కడపకు తరలివెళ్లారు.

పౌర్ణమి దీపోత్సవం


చౌడేశ్వరీ మాతకు దీపోత్సవం నిర్వహిస్తున్న మహిళలు

వల్లూరు : మండల పరిధిలోని దుగ్గాయపల్లెలో వెలసిన శ్రీ చౌడేశ్వరీ మాత ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారి మూలమూర్తితోపాటు ఉత్సవ మూర్తికి అభిషేకాలను నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. రాత్రి చౌడేశ్వరీ మాతకు విశేష పూజలను నిర్వహించారు. మహిళలు అమ్మవారికి పూలు, నిమ్మకాయలు సమర్పించి అమ్మవారి ఎదుట దీపాలను వెలిగించి దీపోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందచేశారు.

యాచకులకు దుప్పట్లు పంపిణీ


యాచకులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న సేవా సమితి సభ్యులు

ఎర్రగుంట్ల : పట్టణంలో రోడ్డుపైన ఉన్న 30 మంది యాచకులకు మదర్‌థెరిసా సేవా సమితి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతలు సహకారంతో శనివారం రాత్రి దుప్పట్లను పంపిణీ చేసినట్లు ట్రస్ట్ చైర్మన్ విజయ్‌కుమార్ ఆదివారం తెలిపారు.

చలితో జాగ్రత్త..!

- కనిష్ట స్థాయికి పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- ఉన్నిదుప్పట్లు కొనుగోలు చేసేందుకు ప్రజల ఆసక్తి
- జాగ్రత్తలు పాటిస్తే వ్యాధులు రావంటున్న వైద్యులు


తెల్లవారు జామున రోడ్డును కప్పేసిన పొగ మంచు


ఉన్ని దుస్తులకు పెరుగుతున్న ఆదరణ

ఎర్రగుంట్ల : మండలంలో రోజురోజుకు చలి పెరుగుతోంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో బాగా ప్రభావం చూపుతోంది. శీతలగాలులు వీస్తుండటంతో ప్రజలు వణుకుతున్నారు. చలి ముందురుతుండటంతో వివిధ రకాల వ్యాధులు ప్రబలే అవకాశముంది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, బాలింతలు, గర్భిణులు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తం..

చలి పెరుగుతుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. తీసుకొనే ఆహారం నుంచి ధరించే దుస్తులు వరకు పలు జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు. చలిలో తిరగడం వల్ల న్యూమోనియాతో పాటు శ్వాస సంబంధిత వ్యాధులు, ఎలర్జీ వంటివి వచ్చే అవకాశముంది. ఆస్తమా వ్యాధిగ్రస్తులు మరింత జాగ్రత్తగా ఉండాలి. నిత్యం వాడే మందులను ఎప్పుడూ సిద్ధంగా ఉంచుకోవాలి. ఇస్నోఫియాలో హృద్రోగులు, పిల్లలు, వృద్ధులు, బాలింతలు, గర్భిణులు మరింత జాగ్రత్తలు తీసుకోవాలి. శరీరం ఎప్పుడూ వేడిగా ఉండాలి. ఉన్ని దుస్తులు దుమ్ము, ధూళి లేకుండా చూసుకోవాలి.

తప్పనిసరైతేనే ప్రయాణాలు

నేరుగా చలిలో, మంచు కురుస్తున్నప్పుడు, దట్టంగా పొగ మంచులో నడక, వాహన ప్రయాణాలను మానుకోవాలి. తప్పనిసరి అయితే చలిని తట్టుకునేలా ఏర్పాట్లు చేసుకుని బయటకు వెళ్లాలి.

వాకింగ్‌కు వేళ్లేటప్పుడు

వాస్తవంగా చలి గాలుల్లో సూక్ష్మక్రిములు అధికంగా ఉంటాయి. గాలి ద్వారా శరీరంలోకి ప్రవేశించే అవకాశం ఉంది. అందుకే ఉదయం వాకింగ్, ద్విచక్రవాహనాలపై ప్రయాణించేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ముక్కు చెవులోకి గాలి వెళ్లకుండా మంకీ క్యాప్ ధరించాలి. వేకువ జామున వాకింగ్‌ను వెళ్లటం అంత మంచిది కాదు. సూర్యకిరణాలు పడిన తర్వాత శరీరంలో ఉష్ణాగ్రతలు పెంచేలా జాగింగ్‌తో పాటు వ్యాయామం చేస్తే మంచిదని వైద్యులు చెబుతున్నారు.

వ్యాధిగ్రస్తులూ జాగ్రత్త

వృద్ధులు, మధుమేహం, గుండె , ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడేవారు జాగ్రత్తలు తీసుకోవాలి. చల్లని వాతావరణంలో అరు బయటకు వెళ్లరాదు. శరీరాన్ని పూర్తిగా కప్పేలా దుస్తులు ధరించాలి. తేలికగా జీర్ణమయ్యే ఆహారం తీసుకోవాలి. జలుబు, దగ్గు రెండు రోజులైనా తగ్గక పోతే డాక్టర్‌ను సంప్రదించాలి. నీళ్లు ఎక్కువగా తాగాలి వేజ్‌లీన్ , పెట్రోలియమం జెల్లీలు ఉపయోగించాలి. తెల్లవారుజామున, రాత్రి వేళల్లలో స్నానం చేయరాదు, చిన్నారులను చలిలో బయటకు తీసుకురాకూడదు. అత్యవసరంగా బయటకు తీసుకెళ్లాంటే తలకు, శరీరాన్ని పూర్తిగా కప్పేలా దుస్తులు తొడిగించాలి.

ఘనంగా దత్త జయంతి


గణపతి హోమంలో పాల్గొన్న పీఠాధిపతి రమాదేవి, భక్తులు

కమలాపురం : మండలంలోని నల్లింగాయపల్లెలో వెలసిన శ్రీ అవధూతేంద్ర స్వామి దత్త జయంతుత్సవాలను ఆదివారం దత్త పీఠాధిపతి రమాదేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనము, మాతృకా పూజ, పంచగవ్య ప్రాశణ, నవగ్రహ మండపారాధన, దత్తాత్రేయ స్వామికి విశేష అభిషేకము, గణపతి దత్తాత్రేయ అనఘాదేవికి అష్టోత్తర పూజలు నిర్వహించారు. గణపతి హోమం, రుద్ర హోమం, లక్ష్మీ నారాయణ హోమం, మహా సుదర్శన హోమం, లక్ష్మీ కుభేర హోమం, చండీ హోమం, ఆదిత్యాది నవగ్రహ హోమం, అయుష్య హోమం, మహా పూర్ణాహుతి, మంత్ర పుష్పము, తీర్ధ ప్రసాద వినియోగం నిర్వహించారు. సమీప ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. కా యకర్పూరం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం


నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి

పులివెందుల టౌన్ : పట్టణంలో ఆదివారం జరిగిన పలు వివాహ వేడుకలలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వదూవరులను ఆశీర్వదించారు. పట్టణంలోని ఎస్సీఎస్సార్ ఫంక్షన్ హాల్‌లో ఏసీ నారాయణరెడ్డి కుమార్తె జ్యోతి, శివరాజ్‌కుమార్‌రెడ్డిల వివాహానికి హాజరై వదూవరులను ఆశీర్వదించారు. అలాగే ఏఎ ఏ ఫంక్షన్ హాల్‌లో ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ప్రియాంకల వివాహ వేడుకలకు వెళ్లి వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ హాల్ గంగాధర్‌రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, కౌన్సిలర్ కోడి రమణ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


రోడ్డు మధ్యలో ఉన్న పెద్ద గుంత

ఎర్రగుంట్ల : మండలంలోని హనుమనుగుత్తి గ్రామ పంచాయతీలో బీస్మిల్లాబాద్ గ్రామం వద్ద రోడ్డు మధ్యలో పెద్ద గుంత పడింది. ఆదమరచి వాహనాలు నడిపితే అంతే సంగతులు. అధికారులు స్పందించడంలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ప్రొద్దుటూరు, పోట్లదుర్తి, హనుమనుగుత్తి, కోగటం గ్రామాలు కలుపుకుని కమలాపురంకు ప్రజలు వాహనాలలో వెళ్తుంటారు. ఇప్పటికైన పెద్ద ప్రమాదం జరగక ముందే అధికారులు స్పందించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

గంగమ్మతల్లికి విశేష పూజలు


విశేష అలంకారంలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లిని భక్తులు దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఆదివారం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు, గంధం, పూలమాలలతో విశేష అలంకారం చేశారు. అనంతరం బంధుమిత్రులతో విందు భోజనం ఆరగించారు. అనంతరం ఆలయ ఆవరణలోని ఇతర దేవతామూర్తులను దర్శించుకున్నారు.

నేడు ఆలయ ఆవరణలో బహిరంగ వేలం

ఆలయానికి సంబంధించి భక్తులు సమర్పించే తలనీలాలు సంవత్సరం రోజులపాటు ప్రోగు చేసుకునేందుకు, టెంకాయల విక్రయించేందుకు ఆలయ ఆవరణలో సోమవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు నిర్దేశిత నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని ఆయన సూచించారు.

బాయ్‌కాట్ చేసినా అభ్యర్థులను నిలబెట్టుకోలేని టీడీపీ

- టీడీపీ ఇన్‌చార్జి బిటెక్ రవిపై వైఎస్సార్‌సీపీ నాయకుల ఫైర్
- బీటెక్ రవి కాదు బిల్డప్ రవి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సాఆర్‌సీపీ నాయకులు

పులివెందుల రూరల్ : నియోజకవర్గ వ్యాప్తంగా నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి వైఎస్సార్ సీపీ బాయ్ కాట్ చేసిన 22 మంది అభ్యర్థులను నిలబెట్టుకోలేని టీడీపీది ఒక విజయమేనా అని వేముల మండల వైఎస్సాఆర్‌సీపీ మండల కన్వీనర్ నాగేళ్ల సాంబశివారెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాదులు అన్నారు. ఆదివారం బాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి వారు విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. సాగునీటి ఎన్నికల్లో పోలీస్, అధికార వ్యవస్థలను అడ్డు పెట్టుకుని కూడా 100 శాతం ఏకగ్రీవం చేసుకోలేని నువ్వు నిజమైన దద్దమ్మవు అన్నారు. రెండు దపాలుగా ప్రతి ఎన్నికల్లో పులివెందుల ప్రజలు నీ బట్టలు విప్పి మీనాయకుడి ముందు నిలబెట్టింది మర్చిపోయావా అని ఎద్దేవా చేశారు. పులివెందుల తాలుకా వ్యాప్తంగా 32 నీటి సంఘాల పరిధిలో 288 టీసీ మెంబర్స్‌కు ఎన్నికల జరిగాయన్నారు. వైఎస్సార్‌సీపీ మద్దతు దారులకు ఏ ఒక్కరికి కూడా నో డ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో ఎన్నికలను బహిష్కరించామన్నారు. వంద శాతం ఏకగ్రీవం చేసుకోవాల్సిన ఎన్నికల్లో కూడా 21 టీసీ మెంబర్స్ స్థానాలకు అభ్యర్థులను నిలబెట్టుకోలేక పోయారన్నారు. నీవు బీటెక్ రవి కాదు బిల్డప్ రవి అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తున్న పార్టీ టీడీపీ అన్నారు. కూటమి నాయకులు రాష్ట్రంలో చేస్తున్న పనులను ప్రజలు గమనిస్తూనే ఉన్నారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, రాష్ట్ర నూరుబాషా సంఘం అధ్యక్షుడు రసూల్, జెడ్పీటీసీ బయపురెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లేల రవీంద్రారెడ్డి, శంకర్‌రెడ్డి, రజినీకాంత్‌రెడ్డి, హలు గంగాధర్‌రెడ్డి, కిషోర్, రామమునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పొట్టిశ్రీరాములు వర్ధంతి


కమలాపురంలో పొట్టిశ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు


పులివెందులలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి


సీకేదిన్నె : జెడ్పీ ఉన్నత పాఠశాలలో అమరజీవి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

కమలాపురం : తెలుగు రాష్ట్ర సాధనకు 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పితామహుడు అని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కామిశెట్టి వెంకటరమణయ్య, పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి జిల్లా కార్యవర్గ సభ్యులు రెడ్డి సురేష్ తెలిపారు. ఆదివారం పొట్టి శ్రీరాములు 72వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక కోదండ రామాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేకాంధ్ర ప్రదేశ్ ఏర్పాటు చేయడం కోసం 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి చివరకు ప్రాణత్యాగం సైతం చేసి అమరుడైన అమరజీవి పొట్టిశ్రీరాములు ఆంధ్రప్రదేశ్ పితామహుడు అన్నారు. ఆయన వర్ధంతిని ఆత్మార్పణ దినముగా ప్రకటించిన ప్రభుత్వానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రాజధాని ప్రాంతంలో పొట్టి శ్రీరాములుకు చిహ్నంగా ఒక స్మృతివనం ఏర్పాటు చేసి అక్కడ పెద్ద విగ్రహం ఏర్పాటు చేయాలని వారన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు మాలేపాటి మల్లికార్జున, రెంటాల సురేష్ గుప్త, గ్రేటర్ వాసవీ క్లబ్ ప్రెసిడెంట్ బచ్చు సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

పులివెందులలో.

పులివెందుల రూరల్ : పట్టణంలోని పూల అంగళ్ల సర్కిల్ వద్ద ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు కోసం నిరాహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధింతి వేడులకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పూల అంగళ్ల సర్కిల్ వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించి మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరవ లేనిదన్నారు. భాషాప్రయుక్త రాష్ట్రాల కోసం పోరాటం చేసిన ఆద్యుడని కొనియాడారు. పొట్టిశ్రీరాములు 1901 మార్చి 16న జన్మించి 1952 డిసెంబర్ 15న అమరులయ్యారన్నారు. ఆయన త్యాగ ఫలితమే కర్నూల్ రాజదానిగా ఆంధ్ర రాష్ట్రం 1953 అక్టోబర్ 1న ఏర్పడిందన్నారు. ఆయనతోపాటు మున్సిపల్ చైర్మన్ వరప్రసాదు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్ సీపీ నాయకులు రాము, గంగాధర్‌రెడ్డి, నూరుబాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రసూల్, వైఎస్సాఆర్ సీపీ నాయకులు తదతరులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని మండలంలోని అధికారులు, ప్రజలు ఆదివారం ఆయన చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీవో కులాయిబాబు, ఈఓఆర్డీ వెంకటసుబ్బారెడ్డిలు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అలాగే కొలుములపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, ఎస్టీయూ నాయకులు కంభం బాలగంగిరెడ్డి ఆధ్వర్యంలో అమరజీవికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాల గంగిరెడ్డి మాట్లాడుతూ ఈరోజు తెలుగు వారు ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేసుకుని సంతోషంగా ఉండడానికి ప్రధాన కారణం పొట్టి శ్రీరాములు అని తెలిపారు. మాతృభాష మాట్లాడే వారికి ప్రత్యేక రాష్ట్రం ఉండాలని, భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పాటుకు నాంది పలికి ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి వేరు చేసి తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం ఇవ్వాలని ఆయన సాగించిన మహోత్తర పోరాటం మరువలేనిదన్నారు. ఆ మహనీయుని త్యాగం చాలా గొప్పదని కొనియాడారు. అనంతరం వ్యాసరచన పోటీలు పెట్టి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు మూడు సెంట్ల స్థలం ఇవ్వాలి

జమ్మలమడుగు : రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు మూడు సెంట్ల ఇంటి స్థలం మంజూరు చేసి ఇంటి నిర్మాణం కోసం రూ. 5 లక్షలు రుణ సదుపాయం కల్పించాలని ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరనాల శివనారాయణ కోరారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలొ ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి రాగానే చేనేత కార్మికులకు మూడు సెంట్ల ఇంటి స్థలం మంజూరు చేస్తామని హామీఇచ్చారు. అధికారంలోనికి వచ్చి ఆరునెలలు అవుతున్న చేనేతలకు ఇచ్చిన హామీలను ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. అదే విధంగా చేనేత మగ్గానికి 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు ఉచిత కరెంటు కూడా అమలు చేయాలన్నారు.

రేపు పెన్షనర్ల దినోత్సవం

కడప సెవెన్‌రోడ్స్: కడప పాత రిమ్స్‌లోని బీసీ భవన్‌లో ఈ నెల 17వ తేదీ ఉదయం పది గంటలకు జాతీయ ప్రభుత్వ పెన్షనర్ల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నారెడ్డి, రామ్మూర్తినాయుడు ఓ ప్రకటనలో తెలిపారు.

కాశిరెడ్డినాయనకు ప్రత్యేక పూజలు

లింగాల : వనంబావి శివాలయం వద్ద వెలిసిన కాశిరెడ్డి నాయన ఆరాధనోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు అర్చనలు, నిర్వహించారు. వందలాధిమంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఉదయం 9 గంటల నుంచి సీనీయర్ ఎద్దులచే బండలాగుడు పోటీలను నిర్వహించారు. పోటీలలో వివిధ ప్రాంతాల నుంచి 12 జతలు ఎద్దులు పాల్గొన్నాయి. పోటీలలో ప్రొద్దుటూర్ వైఎమ్మార్ కాలనీకి చెందిన గురివిరెడ్డి ఎద్దులు మొదటి బహుమతి రూ.70 వేలు, ప్యాపిలి మండలం ఆర్‌ఆర్‌పల్లెకు చెందిన నాగయ్య ఎద్దలు రెండవ బహుమతి రూ.50 వేలు, ప్రొద్దుటూరు మండలం రంగనాయపల్లె గ్రామానికి చెందిన వెంకటసుబ్బారెడ్డి ఎద్దులు 3వ స్థానంలో రూ.40 వేలు, గార్లదిన్నె గ్రామానికి చెందిన రమేష్ ఎద్దులు నాలుగవ స్థానంలో రూ.30 వేలు, మైదుకూరుకు చెందిన వెంకటేష్ ఎద్దులు 5వ స్థానంలొ రూ.20 వేలు, తాడిపత్రి జీవీఆర్ కాలనీకి చెందిన రమేష్‌బాబు యాదవ్ ఎద్దులు ఆరవ స్థానంలో రూ.10 వేలు అందుకన్నారు. మిగిలిని ఆరు జతలు ఎద్దులకు రూ.5 వేలు చొప్పున బహుమతులను అందజేశారు. వైఎస్సార్‌సీపీ కడప పార్లమెంట్ కన్వీనర్ సొరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పోటీలను ప్రారంభించారు. అనంతరం రాత్రి 7 గంటల నుంచి పంచరత్నాలు నాటక ప్రదర్శనలు నిర్వహించారు.

సేవాసమితికి అన్ని విధాలా సహకరిస్తాం


భూమిపూజ చేస్తున్న కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల టౌన్ : స్నేహిత అమృత హస్తం సేవా సమితికి అన్ని విదాలా సహకరిస్తామని కడప ఎంపీ అవినాష్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని హౌసింగ్ కాలనీ సమీపంలో రాజశేఖర్‌గుప్తా దానంగా ఇచ్చిన స్థలంలో ఆదివారం భూమిపూజ నిర్వహించారు.

స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో నూతన భవన నిర్మాణం కొరకు కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. స్నేహిత అమృత హస్తం సేవాసమితి సేవలకు పూర్తిస్థాయిలో సహకరించి నూతన భవన నిర్మాణం పూర్తి చేస్తామని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కొనియాడారు. అనంతరం స్థల దాత రాజశేఖర్ గుప్తాను సత్కరించి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం నేత్రదానం చేసిన కుటుంబ సభ్యులకు జ్ఞాపికలు అందజేశారు. రాజు మాట్లాడుతూ ఇంత వరకూ సేవా కార్యక్రమాలను ప్రోత్సహిస్తూ సహాయ సహకారాలు అందించిన వారికి హృదయ పూర్వక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేముల జడ్పీటీసీ బయపురెడ్డి, కడప ఆర్టీసీ వర్క్ షాప్ డిపో మేనేజర్ మునీంద్రుడు, ఐఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ మునిబాబు, శ్రీ రాజా కళా నిలయం మాస్టర్ రాజా, సేవాసమితి కార్యదర్శి సునీత, నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్, సభ్యులు, స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో అలరించిన నృత్య ప్రదర్శనలు



గ్రూప్‌డ్యాన్స్‌లో చిన్నారులు

పులివెందుల టౌన్ : స్థానిక శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. తలుపుల రామమోహన్, పులివెందుల శ్రీ లక్ష్ శ్రీనివాస జ్యువెలర్స్ వారి సౌజన్యంతో డ్యాన్స్‌మాస్టర్ ఆర్.మానస (నాట్య మయూరి, గిన్నిస్ వరల్డ్ రికార్డ్ హోల్డర్,నంది అవార్డు గ్రహీత,తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్) మానస నృత్య కళాకేంద్రం, ధర్మవరం వారి చిన్నారులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. తదితర పాటలకు కళాకారులు నృత్యం చేసి ఆకట్టుకున్నారు. శిల్పారామం ఏఓ సుధాకర్ పర్యవేక్షించారు.

నారాపురస్వామికి ప్రత్యేక పూజలు


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

జమ్మలమడుగు : మార్గశిర మాసం సందర్భంగా పట్టణంలోని టీటీడీ నారాపురస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆదివారం పౌర్ణమి సందర్భంగా టీటీడీ, శ్రీవారి సేవా సమితి ఆధ్వర్యంలో భూదేవి, శ్రీదేవి వెంకటేశ్వరుడి స్వా మికి రథోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భగుడి ప్రాకార మహోత్సవంలో భాగంగా భ క్తులు భారీ సంఖ్యలో రథోత్సవంలో పాల్గొన్నారు. టీటీడీ అధికారి మోహన్, ఆలయ అర్చకుడు శ్రీనాథ, శ్రీవారి సేవాసమితి అధ్యక్షుడు సుధాకర గుప్త పాల్గొన్నారు.